ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే

- ఆయా గ్రామాల్లో సర్వే చేపట్టిన అధికారులు

బిజినేపల్లి, నవంబర్ 6 : మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీడీవో కతలప్ప మాట్లాడుతూ ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సభ్యుల వివరాలను ఈ సర్వేలో భాగంగా నివేదికలు పొందుపర్చడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ఆధార్‌కార్డు, పట్టాదారుపాస్‌బుక్, రేషన్‌కార్డు ఇతర కుటుంబ సభ్యుల వివరాలను తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీరాములు, ఎంపీవో నర్సింహులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

8 వరకు ఇండ్ల జాబితా నమోదు

అచ్చంపేట, నవంబర్ 6 : కులగణన.. దేశంలోనే రోల్ మోడల్‌గా నిలుస్తుందని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, సీబీఎం ట్రస్ట్ చైర్‌పర్సన్ అనురాధ తెలిపారు. బుధవారం పట్టణంలోని మధురానగర్‌లో కులగణన సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ వరకు ఇండ్ల జాబితా నమోదు చేపడుతారన్నారు. 9వ తేదీ నుంచి ప్రభుత్వం ముద్రించిన ఫార్మాట్‌లో కుటుంబ వివరాలను ఎన్యుమరేటర్లు సేకరించి నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాం సుందర్, అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి తావులేదు..

అచ్చంపేట (లింగాల), నవంబర్ 6 : సమగ్ర కుటుంబ సర్వేలో నిర్లక్ష్యానికి తావులేదని ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. బుధవారం మండలంలో ఇంటింటి సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ వివరాలను సేకరించేందుకు పంచాయతీ కార్యదర్శులు స్టిక్కర్లను అతికించారన్నారు. కార్యక్రమంలో ఎంపీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి వీరస్వామి పాల్గొన్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, నవంబర్ 6 : మండలంలో కులగణనలో భాగంగా నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర సర్వే బుధవారం ప్రారంభమైంది. మండలంలోని మరికల్‌లో జిల్లా విద్యాధికారి, మండల ప్రత్యేకాధికారి గోవిందరాజులు సర్వేను ప్రారంభించారు. మండలంలో మొత్తం 11వేల కుటుంబాలకు మొదటి రోజు 1198 ఇంటి సర్వేలు నిర్వహించినట్లు ఎంపీడీవో లక్ష్మీదేవి తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ రామకృష్ణయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, నవంబర్ 6 : గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద సర్వే నిర్వహించి ప్రజల నుంచి పూర్తి సమాచారం సేకరించాలని కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములు అన్నారు. బుధవారం కల్వకుర్తి మండలం మార్చాల, జిల్లెల్ల గ్రామాల్లో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే సమయంలో ప్రతిఒక్కరూ తమ ఆధార్, రేషన్‌కార్డు, ధరణి పాస్‌పుస్తకాలను ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమేశ్, తిరుపతి ఉన్నారు.

వంగూరులో..

వంగూరు, నవంబర్ 6 : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంలోని గెల్వలాంబ మాత ఆలయంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే కోసం ఇంటికి వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించి వివరాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో తాసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీవో విజయభాస్కర్, డీటీ వెంకటరమణ, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పండిత్‌రావు, నాయకులు రమేశ్‌గౌడ్, బుచ్చిరెడ్డి, జనార్దన్, అధికారులు పాల్గొన్నారు.

వంగూరు : సర్వే ప్రారంభిస్తున్న కేవీఎన్‌రెడ్డి

బిజినేపల్లిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేత

వంగూరు, నవంబర్ 6 : మండలంలోని కోనేటిపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రశాంత్‌రావు బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు ఎలాంటి ఇబ్బందులు పెట్టినా లీగల్ సెల్‌ను సంప్రదించాలని, కార్యకర్తలు ధైర్యంగా పని చేయాలని కేటీఆర్ సూచించినట్లు ప్రశాంత్‌రావు తెలిపారు.

మాజీ మంత్రి కేటీఆర్‌తో ప్రశాంత్‌రావు

ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

- హాజరైన సీఎం రేవంత్ సతీమణి గీత, సోదరులు

పూజా కార్యక్రమంలో పాల్గొన్న సీఎం సతీమణి గీత, సోదరులు

వంగూరు, నవంబర్ 6 : సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామమైన మండలంలోని కొండారెడ్డిపల్లిలో అభయాంజనేయ స్వామి నూతనంగా నిర్మిమించిన ఆలయం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గోపూజ, గణపతి పూజ, రక్షబంధనం, యాగశాల ప్రవేశం, ఆరాధన పూజలు, సాయంత్రం దేవతా విగ్రహాల గ్రమోత్సవం, నవగ్రహ దేవత హోమం తదితర కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత, సోదరుడు కృష్ణారెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

క్రీడాకారులతో పీడీలు, పీఈటీలు

కల్వకుర్తి రూరల్, నవంబర్ 6 : క్రీడలతో శారీరక మానసికోల్లాసంతోపాటు ఉజ్వశమైన భవిష్యత్ ఉంటుందని నాగర్‌కర్నూల్ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాండు అన్నారు. బుధవారం కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జహంగీర్, పీడీ మోహన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాలబాలికల ఎస్జీఎఫ్ అండర్-17 ఖోఖో టోర్నమెంట్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడల ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో తమ ప్రతిభను చాటి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలన్నారు. పాఠశాలలో క్రీడల నిర్వహణకు సహకరించిన ఆశాదీప్‌రెడ్డిని పీడీలు, పీఈటీలు సన్మానించారు. తాండ్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో టోర్నమెంట్ నిర్వహించడం పట్ల పలువురు అభినందించారు. కార్యక్రమంలో పీడీలు రమేశ్, పూరన్‌చంద్, ప్రకాశ్, డాక్యా, ప్రసాద్, అంజి, రమేశ్, మణి, వరలక్ష్మి, లీల, సుభాషిణి, బాలస్వామి, తిరుపతి, పీఈటీలు, పీడీలు ఉన్నారు.

దళారులకు ధాన్యాన్ని విక్రయించొద్దు

చారకొండ, నవంబర్ 6 : రైతులు వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించాలని ఏవో తనుజ అన్నారు. బుధవారం మండలంలోని జూపల్లిలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏగ్రేడ్ రకం రూ.2,320, బీ గ్రేడ్ రకం రూ.2,300 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో వెంకటయ్య, ఏఈవో సుష్మ, నాయకులు బాలరాజు, రాములుయాదవ్, జంగయ్యయాదవ్, భీమయ్య ఉన్నారు.

వెట్టిచాకిరీ నుంచి బాలకార్మికులకు విముక్తి

కొల్లాపూర్ రూరల్, నవంబర్ 6 : కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన ఆదివాసి బాలకార్మికులకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి లభించింది. కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామానికి చెందిన గొర్రెల యాజమాని సాయికృష్ణ వద్ద గొర్రెల కాపరులుగా పని చేస్తున్న బాలకార్మికులను బుధవారం జాతీయ ఆదివాసి సొలిడిటర్ కౌన్సిల్ సభ్యుడు విజయరాజు, చైల్డ్ లీగల్ అధికారి రాంకుమార్, కోనేరు స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ ఆంజనేయులు అదుపులోకి తీసుకొని కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయంలోని ఆర్డీవో బన్సీలాల్ వద్ద హాజరుపర్చారు. ఆర్డీవో బన్సీలాల్, తాసీల్దార్ విష్ణువర్ధన్ రావులు గొర్రెల యాజమానులకు, బాలకార్మికులకు వారి సమీప బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలకార్మికులను నాగర్‌కర్నూల్ ఆశ్రమ పాఠశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో బన్సీలాల్ మాట్లాడుతూ బాలలతో బలవంతంగా వెట్టిచాకిరి చేయించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

తిమ్మాజిపేట, నవంబర్ 6 : ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన మండలంలోని గొరిట గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. వెంకాయపల్లి గ్రామానికి చెందిన జేసీబీ ఆపరేటర్ మహేశ్‌తో గొరిట గ్రామానికి చెందిన సంతోషకు వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా.. మహేశ్ ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్నాడు. కాగా, సంతోష తన పిల్లలతో కలిసి గొరిటలో ఉంటున్నది. ఈ నెల 4వ తేదీన తనకు ఆరోగ్యం బాగాలేదని, దవాఖానలో చూపించుకుంటానని ఇంటి నుంచి వెళ్లిన సంతోష.. తిమ్మాజిపేటలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న రెండో కూతురు అమూల్య, కుమారుడు తరుణ్‌ను స్కూల్ నుంచి తీసుకెళ్లి అదృశ్యమైంది. అదేరోజు సాయంత్రం పెద్ద కుమార్తె ఇంటికి వచ్చి చూడగా ఎవరూ కనిపించలేదు. విషయాన్ని తన తండ్రికి చెప్పగా.. మహేశ్ గ్రామానికి చేరుకొని రెండు రోజులుగా వెతికినా జాడ లభించలేదు. దీంతో బుధవారం మహేశ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

అచ్చంపేట రూరల్, నవంబర్ 6 : ఉమామహేశ్వర ఆలయంలో నిత్యాన్నదానానికిగానూ మండలంలోని పుల్జాల గ్రామానికి చెందిన బీరం మాధవి, రాజేశ్వర్‌రెడ్డి దంపతులు బుధవారం రూ.25,116 విరాళం అందజేశారు. కాగా, కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాల అయ్యప్ప స్వామి భక్తులకు అర్చకులు వీరయ్య శాస్త్రి, గురుస్వామి మహేశ్ చేతుల మీదుగా మాలధారణ గావించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన జీపీ సిబ్బంది

ఉప్పునుంతల, నవంబర్ 6 : కలెక్టరేట్ వద్ద బుధవారం చేపట్టిన ధర్నాకు మండలం నుంచి గ్రామపంచాయతీ సిబ్బంది తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం బకాయి వేతనాలను, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది హాబీబ్, భీమయ్య, రమేశ్, రాంచంద్రయ్య, రాజలింగం, అంకులు, మౌనిక, జయమ్మ, తిరుపతమ్మ, బాలచంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతకు పర్మిషన్ తప్పనిసరి

పెంట్లవెల్లి, నవంబర్ 6 : ఇంటి పరిసరాలు, వ్యవసాయ భూముల్లోని చెట్ల నరికివేతకు అటవీశాఖ అధికారుల పర్మిషన్ తప్పనిసరి అని, చెట్లను అక్రమంగా నరికితే చర్యలు తీసుకుంటామని కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం మండలకేంద్రంలోని సా (కట్టె కోత) మిల్లులను అటవీ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెహమాన్‌కు చెందిన మిల్లులో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కలపను గుర్తించి రూ.3 వేల జరిమానా విధించినట్లు చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను తొలగించాలనుకుంటే టన్నుకు రూ.2వేల వరకు ఆన్‌లైన్‌లో చాలన్ చెల్లించి అటవీశాఖ అధికారుల పర్మిషన్ తీసుకోవాలన్నారు. మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కాశన్న, ఫారెస్ట్ అధికారులు ముజీబ్, వెంకటయ్య, మల్లేశ్, నీలేశ్ పాల్గొన్నారు.

వ్యక్తికి పది రోజులు జైలుశిక్ష

నాగర్‌కర్నూల్, నవంబర్ 6 : మద్యం తాగి ద్విచక్ర వాహనాన్ని నడిపిన ఓ వ్యక్తికి పదిరోజులు జైలు శిక్ష పడిన ఘటన తెలకపల్లి మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై నరేశ్ కథనం మేరకు ఈ ఏడాది మే 28వ తేదీన తెలకపల్లిలో గల రాకొండ వెళ్లే దారిలో శివగంగ ఫంక్షన్‌హాల్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో రాకొండ గ్రామానికి చెందిన కృష్ణ తన ద్విచక్ర వాహనాన్ని తాగిన మైకంలో నడుపుతూ పట్టుబడ్డాడు. డ్రింక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేసి మద్యం తాగినట్లు నిర్ధారించి కేసు నమోదు చేశారు. ఈమేరకు బుధవారం నాగర్‌కర్నూల్ మార్నింగ్ కోర్టు జడ్జి రామయ్య ముందు హాజరుపరచగా నిందితుడికి 10 రోజుల జైలుశిక్షతోపాటు రూ.500 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

కల్వకుర్తి, నవంబర్ 6 : అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పిలుపునిచ్చారు. కల్వకుర్తి మున్సిపాలిటీలోని వార్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.40లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు డైన్ పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ప్రారంభించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షాహిద్, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, కౌన్సిలర్లు గోపిరెడ్డి, లక్ష్మీరాంరెడ్డి, సైదులు, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణ స్థల పరిశీలన

తూడుకుర్తిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ రూరల్, నవంబర్ 6 : నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామ సమీపంలో నిర్మించతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ విద్యాలయాల నిర్మాణ స్థలాన్ని బుధవారం ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రతిష్టాత్మకంగా విద్యనందించే లక్ష్యంతో మొదటి విడుతలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తూడుకుర్తిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఎత్తు తగ్గులుగా ఉన్న స్థలాన్ని చదును చేస్తుండగా ఆ పనులను బుధవారం ఎమ్మెల్సీ పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, డేవిడ్ ఉన్నారు.

లబ్ధిదారులను క్రమబద్ధీకరించాలి

నాగర్‌కర్నూల్, నవంబర్ 6: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న ఇళ్ల లబ్ధిదారులను క్రమబద్ధీకరించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి, తాసీల్దార్‌కు లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. 25 సంవత్సరాల కిందట జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ఎర్ర జెండాలు పట్టి ఇళ్ల స్థలాల కోసం పోరాటం నిర్వహిస్తే ప్రభుత్వం దిగివచ్చి బాధితులకు 110 గజాల చొప్పున కేటాయించారన్నారు. నాటి నుంచి నేటి వరకు చాలా మంది ఇల్లు కట్టుకొని నివాసం ఉంటూ తమ జీవితాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా అనేక సందర్భాల్లో కాలనీలో ఉంటున్న ఇండ్లను క్రమబద్ధీకరించాలని రోడ్డు, మంచినీటి సౌకర్యం పాఠశాల ప్రైమరీ హెల్త్ సెంటర్, దేవాలయం, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పర్వతాలు, గీత, రామయ్య, అశోక్, కాశన్న, వెంకటేశ్, కుర్మయ్య, కృష్ణయ్య, బాలయ్య, లక్ష్మయ్య, మురళి, జ్యోతి, వెంకటమ్మ, కృష్ణమ్మ, అలివేల, చంద్రకళ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నిధులతో బోరు

తిమ్మాజిపేట, నవంబర్ 6 : మండల కేంద్రంలో యాదవ సంఘానికి చెందిన భీరప్ప ఆలయం వద్ద ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి నిధులతో బోరు వేశారు. ఈ సందర్భంగా స్థానిక యాదవ సంఘం పెద్దలు పూజలను నిర్వహించి బోరును ప్రారంభించారు. నీరు పుష్కలంగా రావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవుఫ్, లింగం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

కల్వకుర్తిరూరల్, నవంబర్ 6 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.10వేల గౌరవ వేతనం అందించాలని సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ పాఠశాలలు ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా కార్మికులకు అందిస్తామన్న గౌరవవేతనం, మెనూ బడ్జెట్‌ను విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచడం సరైందికాదన్నారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో డబ్బులు వడ్డీకి తీసుకొచ్చి విద్యార్థులు భోజనాన్ని అందిస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఆంజనేయులు, బాలస్వామి, నిర్మల, శాంతమ్మ, కలమ్మ, జహేద, నీరంజన్‌బీ, అన్నపూర్ణ, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

యువత ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలి

- ఐక్య సమాజ సంస్థ పోషకుడు రవీంద్రనాథ్

కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీపీ రవీంద్రనాథ్

నాగర్‌కర్నూల్, నవంబర్ 6: ప్రతిఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు కదలాలని, అప్పుడే అనుకున్నది సాధించవచ్చునని విశ్రాంత డీజీపీ డాక్టర్ పుట్టపాగ రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 'యువత, భవిత, బాధ్యత' అనే అంశంపై వ్యక్తిత్వ వికాస నిపుణులు క్రియేటర్ కృష్ణచే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటరమణతో కలిసి మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ ఫొటో వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. మహేంద్రనాథ్ జీవితంలోని ప్రధాన ఘట్టాలతో కూడిన పుస్తకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడిచేందుకు వివేకానంద జీవితాన్ని ఆదర్శంతో ముందుకు సాగాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ ఇంటర్ విద్యకోసం నేటి తరం విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తోందని, మంచిగా చదివి ఐఏఎస్, ఐపీఎస్ అవ్వాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాలెం నర్సింహులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు నర్సింహ, మాజీ జెడ్పీటీసీ మురళీధర్, చిన్నయ్య, ఐక్య సమాజ సంస్థ ప్రతినిధి బాలరాజు, అబ్దుల్లాఖాన్, చిన్నయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న డీఎస్పీ పల్లె శ్రీనివాస్

అచ్చంపేట రూరల్, నవంబర్ 6 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాటి బారిన పడి ప్రాణాలు పోగొట్టుకోవద్దని డీఎస్పీ పల్లె శ్రీనివాస్ సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సైబర్ జాగృతి దివస్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంక్ అకౌంట్, వ్యక్తిగత వివరాలు చెప్పవద్దన్నారు. సీఐ రవీందర్ మాట్లాడుతూ తమ సర్కిల్‌లో 40 సైబర్ కేసులు నమోదయ్యాయని, 13 కేసుల్లో పురోగతి సాధించామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు రమేశ్, పవన్‌కుమార్, నాగరాజు, వెంకట్‌రెడ్డి, రమాదేవి, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

ముగ్గురికి జైలు శిక్ష

అచ్చంపేట రూరల్, నవంబర్ 6 : అదనపు కట్నం కోసం మహిళను వేధించడంతోపాటు ఇనుపరాడ్డుతో కొట్టి గాయాలు చేసిన ముగ్గురు వ్యక్తులకు నేరం రుజువు కావడంతో జైలు శిక్ష పడింది. బాధితురాలి కథనం మేరకు.. అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన సంధ్యాబాయికి అచ్చంపేటకు చెందిన శివకుమార్‌తో 2021 లో వివాహమైంది. కొద్ది రోజుల తర్వాత అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేసి ఇనుపరాడ్డుతో కొట్టగా బలమైన గాయాలయ్యాయి. ఈ మేరకు అప్పటి ఎస్సై ప్రదీప్ కుమార్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా, ఈ కేసును నాగర్‌కర్నూల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి సబితా ట్రయిల్ జరిపి శివకుమార్, అతడి తల్లి రాజేశ్వరి, తమ్ముడు శ్రీకాంత్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు బాధితురాలు తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

పెద్దకొత్తపల్లి, నవంబర్ 6 : పెద్దకొత్తపల్లిలో అభివృద్ధిని మంత్రి జూపల్లి కృష్ణారావు అడ్డుకుంటున్నాడని రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఎన్నో ఏండ్లు గా మండల కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతున్న రెవెన్యూ కార్యాలయానికి రూ.కోటి 75లక్షలతో సొంత భవనాన్ని నిర్మించారు. కాగా మారిన ప్రభుత్వం రెవెన్యూ కార్యాలయాన్ని సొంత భవనంలోకి మార్చకుండా ఇంకా అద్దె భవనంలోనే రెవెన్యూ కార్యాలయాన్ని కొనసాగించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే రెవెన్యూ కార్యాలయాన్ని అద్దె భవనం నుంచి సొంత భవనంలోకి మార్చలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రేణుక, మాజీ సర్పంచ్ నర్సింహ, నాయకులు రాజశేఖర్, వినాయక్‌రెడ్డి, రమేశ్, సాయిలు, రాములు ఉన్నారు.

కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలి

బల్మూరు, నవంబర్ 6 : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయలని సీపీఎం నాయకులు శంకర్‌నాయక్, దేశ్యానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం బల్మూరు ఎస్సీ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్‌లోని సమస్యలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. బాత్రూంలకు డోర్లు లేవని, నీటి సమస్య ఉందని, చలికాలం రావడంతో వేడినీటిని అందజేయాలని విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, నాగరాజు, సయ్యద్ పాల్గొన్నార